క్లుప్తంగా

శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు



మట్టి పనులు చేస్తున్న దృశ్యం

చిప్పగిరి: మండల కేంద్రం చిప్పగిరి నుంచి దౌల్తాపురం, నంచర్ల మీదుగా మద్దికెర వరకు రూ.10 కోట్లతో 12 కి.మీ మేర చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా మట్టి చదును పనులు ప్రారంభమయ్యాయి. బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయితే రెండు గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి చేరుకోవడానికి 40 కి.మీ దూరం తగ్గడంతోపాటు పత్తికొండకు రాకపోకలు సాగించేందుకు సులభతరం కానుంది. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న రహదారి కావడంతో ఆయా గ్రామాల ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కృష్ణగిరి: మండల పరిధిలోని పలు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ వెల్దుర్తి ప్రాజెక్ట్ సీడీపీఓ ల్యూక్ మంగళవారం తనిఖీ చేశారు. మండల కేంద్రలోని రెండు, ఎరుకులచెరువు గ్రామంలోని రెండు, ఆగవేళిలోని ఒక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు, వారికందుతున్న పోషకాహారం, రికార్డులు, స్టాకును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందాల్సిన సేవలలో ఎలాంటి లోపాలు రాకుండా చూసుకోవాలని, చిన్నారుల ఆలనా పాలనాతోపాటు ఆటపాటల విద్య అందించాలని ఆదేశించారు. సూపర్‌వైజర్ శ్రీదేవి వెంట ఉన్నారు.

శ్రీశైల యాత్రికులకు అన్నదానం



శివభక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

హాలహర్వి: మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైల క్షేత్రానికి కాలినడకన వెళ్లే భక్తుల కోసం దేవనకొండ గ్రామ గురుస్వాములు, శివస్వాములు, భక్తజనులు, గ్రామపెద్దలు సహకారంతో దేవనకొండ టర్నింగ్ వద్ద నిత్యాన్నదాన కార్యక్రమం మంగళవారం చేపట్టారు. గత 17 సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వారు తెలిపారు. మార్చి 2వ తేదీ వరకు అన్నదాన శిబిరం ఉంటుందన్నారు.

చిన్నారి చికిత్సకు ఎస్ఐ ఆర్థిక సాయం



చిన్నారి తల్లితండ్రులకు సాయమందిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): తలసేమియా, గుండెలో రంధ్రంతో బాధపడుతున్న వెల్దుర్తికి చెందిన మూడు నెలల చిన్నారి ఇర్ఫాన్ చికిత్సకు వెల్దుర్తి ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తనవంతుగా ఆర్థిక సాయం అందించారు. మంగళవారం చిన్నారి ఇర్ఫాన్ చికిత్స కోసం తల్లిదండ్రులు అల్తాఫ్, సునీతలకు రూ.10 వేలను అందించి ఎస్ఐ ఆదర్శంగా నిలిచారు. అలాగే పట్టణానికి చెందిన కొందరు రూ.2 వేలను చిన్నారి తల్లిదండ్రులకు అందించారు. చిన్నారి చికిత్స కోసం దాతలు సహకరించాలని, ఫోన్ పే నంబర్ 99088 23443కు ఆర్థిక సాయం చేయాల్సిందిగా అభ్యర్థించారు.

గాయత్రీ మాత ఉత్సవాలు ప్రారంభం



ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయిత్రీ మాత 21వ ఆరాధనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు రూపామోహన్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, సరస్వతి పూజా, పుణ్యావచనం, గణపతి పూజా, హోమం, నవగ్రహ పూజ, కలశ స్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు రామతీర్థంలోని కొలనులో పూజ నిర్వహించి గంగాజలాన్ని మేళతాళాలతో భక్తులు అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

చిప్పగిరి: మండలంలోని ఏరూరు గ్రామంలో తాగునీటి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడడంతో ప్రజలకు నీటి సమస్య తలెత్తింది. వెంటనే స్పందించిన గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మి మంగళవారం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు. నీటి సరఫరా పునరుద్ధరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పల్లె ప్రగతికి ప్రణాళిక

- 9 అంశాల యాక్షన్ ప్లాన్ తయారీకి మార్గదర్శకాలు
- దశల వారీగా అమలు



గ్రామసభలో యాక్షన్ ప్లాన్‌పై చర్చిస్తున్న ఈఓపీఆర్డీ ప్రకాష్‌నాయుడు (ఫైల్)

ఆలూరు రూరల్: గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో భాగంగా క్షేత్రస్థాయి అవసరాలతో పాటు 9 అంశాలతో అభివృద్ధి ప్రణాళిక అమలుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఆలూరు మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో యాక్షన్ ప్లాన్ తయారీకి మార్గదర్శకాలు విడుదల చేసి దశల వారీగా అమలుకు శ్రీకారం చుట్టారు.

పక్కా ప్రణాళికతో ముందుకు..

మండలంలో 17 గ్రామ పంచాయతీలున్నాయి. పంచాయతీ ఆదాయంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల వినియోగం, చేపట్టిన అభివృద్ధి పనులు, గ్రామాభివృద్ధికి సంబంధించి ప్రణాళిక తయారు చేస్తుంటారు. జనరల్ ఫండ్స్‌లో 30 శాతం సిబ్బంది జీతభత్యాల కోసం, 15 శాతం తాగునీటి అవసరాల కోసం, 15 శాతం పారిశుద్ధ్యం నిర్వహణ, 15 శాతం వీధిలైట్లు, 10 శాతం రోడ్లు, డ్రైనేజీ నిర్వహణ, 5 శాతం నిధులు ఈ-గవర్నెన్స్ (కంప్యూటర్లు, ఇతర సాంకేతిక అవసరాలు) కోసం వ్యయం చేయాల్సి ఉంది. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు టైడ్ గ్రాంట్ 50 శాతం పారిశుద్ధ్యం, 50 శాతం తాగునీటి అవసరాల కోసం వెచ్చించాలి. అన్ టైడ్ అమౌంట్ స్థానిక అవసరాల కోసం వినియోగించుకోవచ్చు.

9 అంశాలతో అభివృద్ధి

1. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కల్పించడం
2. గ్రామ ప్రజలను ఆరోగ్యవంతంగా ఉంచడం
3. పిల్లలకు స్నేహపూర్వకమైన వాతావరణం కల్పించడం
4. సమృద్ధిగా తాగునీటి సరఫరా
5. పరిశుభ్రత, పచ్చదనం
6. స్వయం సమృద్ధితో కూడిన మౌలిక సదుపాయాల కల్పన
7. సామాజిక న్యాయం, సామాజిక భద్రత కల్పన
8. గ్రామ పంచాయతీలో సుపరిపాలన
9. మహిళలకు స్నేహపూర్వకమైన స్వేచ్ఛా వాతావరణం

ఈ తొమ్మిది అంశాలు ప్రాతిపదికగా గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక తయారు చేసుకోవాలి. ఈ అంశాల్లో ఏదో ఒకటి ప్రతి గ్రామ పంచాయతీ తప్పనిసరిగా ఎంచుకుని, ఆ అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలి. కనిష్టంగా ఒకటి గరిష్ఠంగా రెండు అంశాలను ఎంచుకుని ప్రణాళికను తయారు చేసుకోవాల్సి ఉంటుంది. 2030లోగా సుస్థిర అభివృద్ధి ప్రణాళికే లక్ష్యంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నది దీని ముఖ్య ఉద్దేశం.

ప్రణాళిక ముఖ్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక (జీపీడీపీ)లను రూపొందించుకోవాలి. ఈ ప్రణాళిక మేరకు నిధులు విడుదల అవుతాయి. జీపీడీపీ రూపకల్పనపై ఇప్పటికే జిల్లా అధికారులు శిక్షణ ఇచ్చారు. రూపొందించిన ప్రణాళికపై దశల వారీగా నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

– ప్రకాష్‌నాయుడు, ఈఓపీఆర్‌డీ, ఆలూరు

29న భజన పోటీలు

మద్దికెర: మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్ప స్వామి రథోత్సవం సందర్భంగా ఈ నెల 29వ తేదీ రాత్రి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామప్రజలు మంగళవారం తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, ఆరవ బహుమతి రూ.5 వేలు నగదు అందించనున్నట్లు చెప్పారు. భజన బృందంలో 8 నుంచి 12 మంది సభ్యులు ఉండొచ్చన్నారు. ఎంట్రీ ఫీజు రూ.400 చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 88973 74035, 95731 32458 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

హొళగుంద: వచ్చే నెల 1 నుంచి 15వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కళాశాల పరీక్ష కేంద్రం చీఫ్ సుపరింటెండెంట్ శశికుమార్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ గోవింద్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు వారు హొళగుందకు వచ్చిన సెట్ -1, 2, 3 పరీక్ష పేపర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. వారు మాట్లాడుతూ.. ఇంటర్ ఫస్టియర్ 196 మంది, సెకండియర్ 192 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

గోనెగండ్లకు చేరిన ఎల్లెల్సీ నీరు



ఎస్కేప్ ఛానల్ ద్వారా ఎల్లెల్సీ నుంచి జీడీపీలోకి వదిలిన నీరు

గోనెగండ్ల: తుంగభద్ర దిగువ కాలువ నీరు గోనెగండ్ల సెక్షన్ దిగువ కాలువకు మంగళవారం ఉదయం చేరుకుంది. దీంతో ఎల్లెల్సీ నీటిని జీడీపీ అధికారులు గాజులదిన్నె ప్రాజెక్టులోకి మళ్లించారు. ఈ సందర్భంగా ఏఈ మహమ్మద్ అలీ మాట్లాడుతూ.. గోనెగండ్ల సెక్షన్ దిగువ కాలువకు దాదాపు 239 క్యూసెక్కుల నీరు వస్తోంది. తాగునీటి అవసరాల కోసం ఆ నీటిని ఎస్కేప్ ఛానల్ ద్వారా గాజులదిన్నె ప్రాజెక్టుకు మళ్లిస్తున్నట్లు తెలిపారు. జీడీపీలో ప్రస్తుతం 0.8 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ప్రాజెక్టు ద్వారా డోన్, పత్తికొండ, దేవనకొండ తదితర పట్టణాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు ఎల్లెల్సీ కాలువ ద్వారా నీటిని జీడీపీలోకి మళ్లించినట్లు తెలిపారు. అలాగే కర్నూలు పట్టణానికి తాగునీటి అవసరాల కోసం జీడీపీ నుంచి 40 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు తెలిపారు. ఎవరైనా జలచౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న స్వామి వంశస్తులు

ఆస్పరి: కొలిచే వారికి కొంగుబంగారంగా నిలిచిన దస్తగిరి స్వామి 268 ఉరుసు ములుగుందంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున దస్తగిరి స్వామి గుర్రాన్ని అలంకరించి గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు బిందెలతో నీరు పోసి పూజించారు. దస్తగిరి స్వామి సమాధి, ఆయన వంశస్తుల సమాధులను ప్రత్యేకంగా అలంకరించారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తాము సమర్పించిన పండ్లను స్వామి వారి గుర్రం తింటే అనుకున్న కోర్కెలు తీరుతాయనే నమ్మకంతో భక్తులు గుర్రానికి పండ్లు తినిపించేందుకు ఎగబడ్డారు. నిర్వాహకులు వెంకటరెడ్డి, కృష్ణమూర్తి, నర్సిరెడ్డి, చిన్నాయప్ప, స్వామి వంశీకులు రోషన్‌పీర్ సాహెబ్, అహ్మద్ హుసేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో మెరుగైన వైద్య సేవలు



పూలచింతలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్

నందవరం: పల్లెల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని డాక్టర్ శ్రీలేఖ పేర్కొన్నారు. మంగళవారం పూలచింత గ్రామంలో రెండవ విడుత సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు ఓపీ ద్వారా 402 మందికి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిబిరంలో 17 రకాల టెస్టులతో పాటు 77 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. గర్భిణులు, బాలింతలకు 12 మందికి రక్త, బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వచ్చే నెల 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్పెషలిస్టు వైద్యులు సర్ఫరాజ్, ప్రవల్లిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల వేలంలో రూ.3.15 లక్షల ఆదాయం



వాహనాలను వేలం వేస్తున్న సెబ్ అధికారులు

ఆలూరు రూరల్: కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఆలూరు సెబ్ స్టేషన్ ఆవరణలో మంగళవారం వేలం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమ మద్యం రవాణా, నాటుసారా సరఫరాపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా పెంచామని చెప్పారు. అనంతరం ఆలూరు సెబ్ పరిధిలో పట్టుబడిన 17 వాహనాలను వేలం వేశారు. వాహనాలకు ఎంవీఐ అధికారులు నిర్ణయించిన ధర రూ.2,34,900 కాగా వేలంలో బిడ్ అమౌంట్ రూ.2,67,500 వచ్చిందన్నారు. 18 శాతం జీఎస్టీతో కలిసి మొత్తం రూ. 3,15,650 ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని చెప్పారు. ఆలూరు సెబ్ సీఐ సోమశేఖర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు సిబ్బంది విజయుడు, చెన్నయ్య, చంద్రన్న, రామలింగమ్మ ఉన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే జైలుకే..



చింతకుంటలో పర్యటిస్తున్న ఎస్ఐ నరేంద్ర

హాలహర్వి: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరేంద్ర హెచ్చరించారు. ఆయన మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో మల్లికార్జునపల్లె, చింతకుంట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికల వేళ.. ఎవరైనా అక్రమంగా నాటుసారా, కర్ణాటక మద్యం అమ్మినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంతంగా ఉండే గ్రామాల్లో అల్లర్లు, గొడవలకు పాల్పడినా, సృష్టించినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పోలీసు సిబ్బంది వెంట ఉన్నారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించండి



మాట్లాడుతున్న పత్తికొండ మండలాధ్యక్షుడు నారాయణదాస్

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నారాయణదాస్ అన్నారు. మంగళవారం పత్తికొండలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపీడీఓ డి.రామారావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తెలియజేశారు. ఎంపీపీ నారాయణదాస్ మాట్లాడుతూ.. వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు జలజీవన్ మిషన్ కింద గ్రామాల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. కొన్నిగ్రామాల్లో రైతులకు పంట నష్టపరిహారం సొమ్ము జమకాలేదని సర్పంచులు చెప్పగా ఆర్‌బీకేల్లో వివరాలు సమర్పిస్తే ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని వ్యవసాయ అధికారులు చెప్పారు. 15వ ఫైనాన్స్ నిధులతో చేపట్టిన పనుల వివరాలను కొందరు ఎంపీటీసీలు అడిగారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీపీ సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు బలరాముడు, రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండండి

హాలహర్వి: ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు బీఎల్‌ఓలు, అధికారులు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ బ్యూల సూచించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, ఆయాశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే ఎన్నికల కమిషన్ చట్టపరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. డీటీ లక్ష్మి, ఎంఈఓ ఈరన్న, ఈఓపీఆర్‌డీ మల్లికార్జున, బీఎల్‌ఓలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం

మద్దికెర: స్థానిక ఆదర్శ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత శాతం లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని ఎంఈఓ రంగస్వామి, ప్రిన్సిపాల్ సవిత అన్నారు. మంగళవారం విద్యార్థుల స్టడీహవర్‌ను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇంటర్మీడియెట్ 122 మంది, పదో తరగతిలో 95 మంది విద్యార్థులున్నారన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులతో పాటు స్టడీహవర్ నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలోనే డే స్కాలర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, వసతి గృహంలో ఉన్న బాలికలకు రాత్రి 7 గంటల నుంచి 10 గంటలవరకు.. తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు రీడింగ్ క్లాసులు నిర్వహిస్తున్నామ న్నారు. అంతేగాక సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

యార్డులో దోపిడీని అరికట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వ్యవసాయ, కూరగాయల హోల్‌సెల్ మార్కెట్ యార్డ్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను సత్వరం అరికట్టి రైతులకు మేలు చేకూర్చాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్‌యాదవ్‌లతో పాటు అఖిలభారత రైతు కూలీ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహులు, జిల్లా కార్యదర్శి సత్యన్న కోరారు. మంగళవారం మార్కెట్ యార్డుకు వచ్చిన జిల్లా మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డికి ఆయా సంఘాల నాయకులు వేర్వేరుగా వినతిపత్రాలిచ్చారు. యార్డులో వ్యాపారులు రైతులను దోపిడీ చేస్తూ సొమ్ము చేసుకొంటున్నారని వీటిని అరికట్టాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు మంగళవారం తెలిపారు. కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ప్రశాంతంగా వేలం పాట

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన బడేసాహెబ్ తాత ఉరుసు సందర్భంగా దర్గా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం టెంకాయల విక్రయ హక్కుల వేలం పాట నిర్వహించారు. దర్గా ధర్మకర్త కుబేర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుమల రెడ్డి, సర్పంచ్ తోలు రాముడు హాజరయ్యారు. వేలం పాటలో రాయచూరు జిల్లా గుంజపల్లికి చెందిన ఇబ్రహీం అనే టెంకాయల వ్యాపారి రూ.4.80 లక్షలకు హక్కులను దక్కించుకున్నారు. వేలం ద్వారా వచ్చిన డబ్బును దర్గా అభివృద్ధికి ఖర్చు చేస్తామని, అలాగే ఉరుసులో తాగునీటి సమస్య ఏర్పడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ధర్మకర్త కుబేర్‌రెడ్డి తెలిపారు. దర్గా కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వేలంలో రూ.13 లక్షల ఆదాయం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ రంగనాథస్వామి దేవాలయం ఆవరణలో తలనీలాలు పోగుచేసుకునే హక్కులు, టెంకాయల విక్రయ హక్కులకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేలంలో.. తలనీలాలను పోగుచేసుకునే హక్కులను అనంతపురంకు చెందిన ఎం.మారెన్న రూ.12.75 లక్షలకు సొంతం చేసుకోగా, టెంకాయల విక్రయ హక్కులను రూ.32 వేలకు అదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ శెట్టి పాట పాడి సొంతం చేసుకున్నారు. ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు నిధుల విడుదల

హాలహర్వి: మండలంలోని రైతులకు బుధవారం పీఎం కిసాన్ – వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల నిధులు విడుదల కానున్నట్లు ఏఓ శివశంకర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని మొత్తం 5669 మంది రైతులకు నిధులు వారి ఖాతాల్లో జమ కానున్నాయన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన శాప్ నెట్‌వర్క్ చైర్మన్



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి శాలువా, పూలమాల వేసి సత్కరిస్తున్న చైర్మన్

ఎమ్మిగనూరుటౌన్: ఏపీ శాప్ నెట్‌వర్క్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మాచాని వెంకటేష్ మంగళవారం సాయంత్రం పట్టణంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు శాలువా, పూలమాల వేసి సత్కరించారు. తనకు రాష్ట్ర స్థాయిలో చైర్మన్ పదవి వచ్చేలా కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

పరామర్శ

పట్టణంలోని గాంధీనగర్‌లో ఉంటున్న తన సన్నిహితుడు ఇబ్రహీంపురం శేషిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. యోగక్షేమాలు తెలుసుకొని వైద్య చికిత్సల గురించి ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు



హొళగుందలో మండల సర్వసభ్య సమావేశం

హొళగుంద: చిన్నహ్యాట, ఎల్లార్తి, నెరణికి తండా గ్రామాలలో మంచినీటి సమస్య ఉందని వేసవిలో సమస్య మరింత జఠిలం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు హేసన్, దర్గన్న తదితరులు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామలీలను కోరారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, నిరుపయోగంగా ఉన్న బోర్లను వినియోగంలోకి తేవాలని పెద్దగోనెహాళ్, ఇంగళదహాళ్ సర్పంచ్‌లు వెంకటరెడ్డి, వెంకట్రామిరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు, పథకాలు గురించి వివరించారు. విద్యుత్ ఏఈ ఓబులమ్మ మాట్లాడుతుండగా.. పెద్దగోనెహాళ్, ఎండీ హళ్లి, ఇంగళదహాళ్ గ్రామాలలో విషపురుగుల బెడద ఉందని విద్యుత్ బిల్లులు చెల్లించలేదనే కారణంతో తొలగించిన కనెక్షన్లను పునరుద్ధరించాలని సర్పంచ్‌లు కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా రెయిన్ గన్లు, పంపులు మంజూరు చేయాలని కోరారు. వందవాగిలి క్రాస్ నుంచి గాదిలింగప్ప గుడి వరకున్న రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని, ఆదోని రోడ్డు పనులు ప్రారంభించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. సచివాలయాలకు మంజూరైన రూ.4 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు జరుగుతున్నట్లు పీఆర్ ఏఈ సోమప్ప తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, వైస్ ఎంపీపీ గాదెమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖలధికారులు పాల్గొన్నారు.

నాడు మూతబడి.. నేడు చదువుల ఒడి



పెండేకల్లు రైల్వే జంక్షన్ ఎస్సీ హాస్టల్ భవనం



హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌లోని ఎస్సీ హాస్టల్ ఎన్నో ఏళ్ల నుంచి ప్రసిద్ధి చెందింది. ఎంతో మంది పేద విద్యార్థులు ఆ హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసించారు. ఆ హాస్టల్‌లో చదివిన ఓ విద్యార్థి గంగారావు హైకోర్టు జడ్జిగా పనిచేస్తున్నారు. అలా ఎంతో మంది చదువులకు ఊతమిచ్చిన హాస్టల్‌ను గత టీడీపీ ప్రభుత్వం పత్తికొండలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మిస్తున్నామన్న కారణంతో మూసివేసింది. దీంతో పేద విద్యార్థులు చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. మరికొందరు వారి స్వగ్రామాల నుంచి కిలోమీటర్ల మేర రాకపోకలు సాగిస్తూ పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చి చదువుకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చదువులకు పెద్దపీట వేశారు. నాడు–నేడు పథకం కింద కోట్లాది రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. విద్యావ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. ఈ క్రమంలో పెండేకల్లు హాస్టల్‌ను పునఃప్రారంభించాలని సర్పంచ్ హారిక, పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పూర్వ విద్యార్థి హైకోర్టు జడ్జి గంగారావు దృష్టికి తీసుకెళ్లారు. వారి కృషితో గతేడాది హాస్టల్‌ను పునఃప్రారంభించారు. గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం అద్దె గదిలో హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు హాస్టల్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు 118 మంది ఉన్నారు. హాస్టల్ పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు అవస్థలు తప్పాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లి దండ్రులు, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీలో ముదురుతున్న వర్గపోరు



గోనెగండ్లలో సోమనాథ్ ఫ్లెక్సీని చించేసిన దృశ్యం

గోనెగండ్ల: మండల టీడీపీలో వర్గపోరు రోజురోజుకు ముదురుతోంది. మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, సోమనాథ్ వర్గాలు బాహాబాహీ ఒకరినొకరు విమర్శించుకుంటున్నారు. సోమనాథ్‌కు కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, ఆయన అనుచరులు మద్దతుగా ఉన్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డికి వర్గ పోరు తప్పడం లేదు. నాలుగు రోజుల క్రితం టీడీపీ అధిష్టానం ప్రకటించిన తొలి జాబితాలో బీవీ పేరు లేదు. ఆ మరుసాటి రోజే కర్నూలులో జరిగిన బీసీ గర్జన సభలో బీవీ వర్గం, సోమనాథ్ వర్గాలు బాహాబాహీగా సభలోనే కుర్చీలు ఎత్తి ఘర్షణకు దిగారు. అంతవరకు స్తబ్ధుగా ఉన్న టీడీపీలో వర్గ విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. గోనెగండ్ల, బి.అగ్రహారం, బైలుప్పల, గంజిహళ్లి తదితర గ్రామాల్లో సోమనాథ్ ఏర్పాటుచేసిన పార్టీ ఫ్లెక్సీలను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. దీనిపై సోమనాథ్ వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.